# రెండు గట్లు

★

శ్రీ దిలీప్‌కుమార్ సేన్‌గుప్త

మానవుని జీవనం నది వంటిది, ఒకవైపు పోత, ఒకవైపు కోత. వీరగుడి పాపయ్యలింగం కథ వినగానే ఈ చిరంతన సత్యం తిరిగి క్రొత్త అర్థంతో నా మనసుకు గుర్తు వచ్చింది. నా కన్నులతో నేను స్వయంగా చూచి ఉండకపోతే 'చంద్రభాను' చెప్పిన మాటలు పూర్తిగా విశ్వసించే వాడినో లేదో సందేహమే. నిజానికి చంద్రభాను పాపయ్యలింగం కథ చెప్పలేదు. అతడు చెప్పింది పాపయ్యలింగం భార్య కథ. మా ఆఫీసులో చంద్రభాను తన రూములో కూర్చుండి ఉండగా అక్కడే ఆమెతో నాకు పరిచయం చేశాడు. చూడగానే నాకాశ్చర్యమయింది. ఆమెతో మాటలాడిన తరువాత మరిన్ని! అంతకుముందు కొద్ది రోజుల క్రితమే అమరావతి వెళ్లడం, అక్కడ రెండువేల యేండ్ల క్రితం మలచిన కుడ్య చిత్రాలు చూడటం జ్ఞాపకం వచ్చాయి. ఆ చిత్రాలలో ఒక స్త్రీమూర్తి ఆకృతిదాల్చి ఎదుట నిలిచినట్లయింది. ఆమెకు ఇంగ్లీషు భాష రాదు. హిందీ కొంచెం వచ్చు. ఆ హిందీ అయినా మాటలాడితే తెలుగు యాస. ఆమె ఒక రచయిత్రి యని చంద్రభాను అంటాడు. ఎన్నో తెలుగు కథలు హిందీలోకి, హిందీ నుండి తెలుగులోకి అనువాదం చేసిందట. కేదార్—బదరీనాథ్ యాత్రలు ముగించుకొని ఏడెనిమిది రోజుల క్రితమే తిరిగి వచ్చి వాళ్ల ఊరిలో సంతర్పణలు, సమారాధనలు చేసింది. ఇదంతా విని నేను మరీ ఆశ్చర్యపోయాను.

"ఇరవై అయిదు, ఇరవై యారు ఏండ్ల వయస్సులో కేదార్—బదరీనాథ్ యాత్ర!"

"తల్లిగారిని తీర్థయాత్రలు చేయించడానికి వెళ్లి వచ్చిందా?'

"లేక అమ్మమ్మగారిని ...... "

"ఎవ్వరినీ తీసుకొని వెళ్లలేదు."

"ఎవరి కూడాను వెళ్లలేదు. తాను ఒంటరిగానే వెళ్లి వచ్చింది."

"ఒంటరిగానా ?"

"—ఒంటరిగా ఏముంది? రెండు వందలమంది తోడి యాత్రికుల చీమలబారులో నే నొకదాన్ని. ఒంటరి నెందు కవుతాను ?"—ఆమె సమాధానం.

"—కేదార్—బదరీనాథ్ యాత్రలకు ముందు కాశ్మీరు కూడా వెళ్లి అక్కడ అమరనాథ్ కూడా చూచి వచ్చాను" —అని ఆమె చెప్పబోయింది.

చాల ఆశ్చర్యంగా ఉందే !

రెండు మూడు నిముషాలు ఆఫీసు వ్యవహారాలు చంద్రభాను తో మాటలాడి నేను నా గదిలోకి వచ్చేశాను.

ఆ తర్వాత చంద్రభాను ని కలుసుకొన్నప్పుడు అతన్ని అడిగాను.

"ఎవరా అమ్మాయి ?"

"శరత్ సాహిత్యంలో కథానాయిక" అని చంద్రభాను జవాబు.

భారతీయ సాహిత్యములో స్త్రీకి సంపూర్ణ స్వాతంత్ర్యము కల్పించి ఆ విశాల పరిధులలో ఆమెని ప్రతిష్ఠితురాలిని చేసిన ప్రథమ రచయిత శరత్‌చంద్రుడు. ఆ అమ్మాయి శరత్‌చంద్రుని కథలకు వాస్తవ రూపాంతరము. అయితే ఆమె పదమూడేండ్ల వయస్సులో తన హృదయం కోరిన హక్కులు సంఘ నియమాల కంటే మూల్యతరం అని ప్రకటించినప్పటికి ఆమె శరత్ సాహిత్యం చదివిఉండలేదు. శరత్‌చంద్రుని కథలు, నవలలు తెనుగులో అనువాదం పొందాయి. అందుబాటులో ఉన్నాయి. అవన్నీ సంపాదించి ఆమె తర్వాత చదివింది. అందు సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన స్త్రీ శ్రీరాజ్యం. పదమూడవ యేటనే ఆమెను మేనమామ కిచ్చి పెండ్లి చేశారు. దానిలో అస్వాభావికత ఏమీ లేదు. అది ఆంధ్ర దేశపు ఆచారం. కాని పెండ్లినాటి రాత్రి మాత్రం శ్రీరాజ్యం ప్రవర్తన అస్వాభావికంగా ఉంది. పడకగదిలో ఆ రాత్రి పెళ్లికొడుకుచేత ఆమె ఒక శపథం చేయించిందట.

"చూడు మావయ్యా ! లోకం దృష్టిలో మన మిద్దరము భార్యాభర్తలం. కాని స్వయంపక్షములో నీవు నాతో ఎన్నడూ మామగా కోరే మర్యాదలు అతిక్రమించకూడదు."

ఆంధ్ర ప్రదేశ్‌లో మేనమామకీ మేనకోడలికీ పెళ్లిళ్లు ప్రాయికంగా జరుగుతూనే ఉంటాయి. అందుకనే ఈ రైతు

కుటుంబాల్లో మేనమామ తన అక్కకు ఆడపిల్ల జన్మించ గానే తన హక్కు భుక్తంగా భావించుకొంటాడు. ఆ యాచారం ప్రకారమే శ్రీరాజ్యం పుట్టినప్పటినుండి ఆమెపైన పాపయ్యలింగం మనస్సు స్థిరపఱచుకొన్నాడు. కాని, ఆ పెండ్లి నాడు శోభనపు గదిలో శ్రీరాజ్యం మాటలు వినగానే అతని కన్నులు సుస్థిరమై నిశ్చలంగా నిలిచిపోయాయి.

శ్రీరాజ్యం తనంతట తానే చంద్రభాను తో ఈ సంగతి చెప్పింది. ఇది విని ఆమె భర్త ఒకే ఒక్క మాట అన్నాడట, ఇలాంటి కోరిక ఈమె కోరినందుకు ''అలాగే'' అని.

శ్రీరాజ్యం పాపయ్యలింగాన్ని ఇదే మాట రెట్టించి అడిగింది.

''నీ వెన్నడూ ఈ శపథం ఉల్లంఘించకూడదు సుమా! అలాగ చేస్తానని ప్రతిజ్ఞ చెయ్యి.''

ఆ మాటకు కూడా పాపయ్యలింగం ''అలాగే'' అన్నాడు. ఆ రాత్రి అంతా ఆ ఉచ్ఛిన్న యౌవన, ఆ నవ వధువు సరసనే 'కుర్చీ' లో కూర్చుండి, అలాగే గడిపివేశాడు.

*　　　　*　　　　*

కష్టమ్సు డిపార్టుమెంటులో ఉద్యోగం చేస్తూ ఉండడంచేత క్రాసు పరీక్ష చేసే ప్రవృత్తి నాకు వృత్తిధర్మంగా సంక్రమించింది.

''ఈమె భర్త వయస్సెంత అప్పుడు ?'' అంటూ నేను చంద్రభాను ని ప్రశ్న వేశాను.

''పెళ్లినాటికి అతని వయస్సు ఇరవై ఎనిమిది.''

''ఏమిపని చేసేవాడు !''

''ఇప్పుడేం చేస్తున్నాడో అదే.''

''. . . . . . . . . . .''

''వ్యవసాయం.''

''ఏమంత కమతం ?''

''చాల సంపన్న కుటుంబం. పెద్ద కమతం— కొంచెమో గొప్పో చదువుకొన్నవాడు. మెట్రిక్ ప్యాస్.''

''అయితే యీ అమ్మాయి నాటకీయ ప్రవర్తనకు కారణం ?''

''మనస్సు యిష్టపడకపోవడం.''

''ఎంతోమంది ఆ యీడు పిల్లలు ఇష్టపడతారే ! ఈమె ఎందుకు యిష్టపడలేదు ?''

''పదమూడేండ్ల ప్రాయంలో ఉన్న తాను ఇరవై ఎనిమిదేండ్ల వయస్సు గల మేనమామను భర్తగా స్వీకరించడం ఆమెకి ఏవిధంగానూ సాధ్యంకాలేదు.''

''ఆ వయస్సుగల యువతు లెందరికో సాధ్యమవుతుందే''

''కావచ్చు ఆమెకు మాత్రం అది సాధ్యపడలేదు.''

''అయితే ఈ ప్రతిజ్ఞకి భర్త ఎలాగు ఒప్పుకొన్నాడు ?''

''ఎలాగో నాకు తెలియదు గాని, పెండ్లినాటి రాత్రి జరిగిన యీ ఒప్పందం భార్యాభర్తలలో ఏ ఒక్కరూ భంగ పఱచలేదు.''

పెండ్లి అయిన తర్వాత శ్రీ రాజ్యం కాపురానికి వచ్చింది. అత్తవారింటిలో ఆమెకు మంచి పేరు ప్రతిష్ఠలు. మనోవాక్కాయ కర్మలలో భర్త యెడల తన విధులు, తన ధర్మము, తన మర్యాద అవిచ్ఛిన్నంగా కాపాడుతూ వచ్చింది. భర్తకూడ భార్య మనోగత వ్యక్తిగత వాంఛలను భంగపఱచే పనులేవీ చేయలేదు. ఆమెపైన ఏరకమైన జులుమ్ ప్రకటించలేదు. పద్నాలుగు పదిహేనేడేండ్లు ఈవిధంగా గడిచిపోయింది.

''రాత్రివేళల్లో వీ రిద్దరిమధ్య, జంట మంచాల మధ్య, అయిదు గజాల దూరం వస్తూనే ఉందా?'' అని నేను ప్రశ్నించాను.

''కాక !''

''అయితే భర్త్ర హృదయంలో ఉవ్వెత్తున లేచే వాసనా సముద్రం ఉద్వేలమై పొంగి పొరలి, ఈ అయిదు గజాల తటరేఖను అతిక్రమించి గట్టు తెగలేదంటావా ? అది ముంచుకొని వచ్చి ఆ ముంపులో ఆమెను కూడ కొట్టుకొని పోయేటట్టు చేయలేదూ ?''

''లేదు, ఏ ఆకర్షణ చూచి భర్త హృదయంలో వాసనా సముద్రం ఉద్వేలమై ఉప్పొంగిపోతుందో, ఆ యాకర్షణగల ముఖచంద్రము అతనివైపు తుషార హిమానీ శీతలమైన భాగమే త్రిప్పేది. ఇంకే సముద్రం పొంగుతుంది ?''

''సరేకాని, ఇంతకీ అతని యెడల ప్రతిరుద్ధమైనది, శ్రీరాజ్యం మనస్సా శరీరమా ?

''ఆ ప్రశ్న నే నడగలేదు. అడిగితే మాత్రం ఏమిటి ? ప్రయోజనం ? ఒకవేళ చంద్రభాను ఈ ప్రశ్న వేసినా కాని శ్రీరాజ్యం విప్పి చెప్పగల్గుతుందా ''

''చంద్రభాను స్వయంగా తెలుగు సాహిత్యంలో గొప్ప రచయిత. ఈ హోదాలోనే శ్రీరాజ్యం తో అతనికి పరిచయం. శ్రీరాజ్యం తన జీవితకథ యెంతవరకు చెప్పిందో అంతవఱకు మాత్రమే తెలుసు. శ్రీరాజ్యం తా నెలాగు తెలుగు చదువుకొన్నదీ, దాని తరువాత ఎలాగు హిందీ నేర్చుకొన్నదీ, హిందీ నుండి తెలుగు అనువాదాలు ఎలాగు చేస్తున్నదీ, ఇవన్నీ

చంద్రభానుతో చెప్పింది. చంద్రభాను యీమె రచ
చలు చదివి అప్పుడప్పుడు మరామ్మత్తు చేస్తూ ఉంటాడు.''

''ఎలాగు వ్రాస్తుంది ?''

''సుభాషిణిలాగా ?'' అని నవ్వుతూ ప్రశ్న వేసేటప్ప
టికి చంద్రభాను బిగ్గఱగా నవ్వి ''అలాగు కాదులే'' అని
సమాధానం చెప్పాడు. సుభాషిణి ముప్పయి యేండ్ల అల్ప
వయస్సు దాటకుండానే ముప్పైఆరు నవలలు వ్రాసింది.
అవన్నీ జనాదరణ పొందాయి. చంద్రభాను ఉద్దేశంలో
జనాదరణ అంటే, సామాన్య జనతాభిమానం అని. అంటే
పురుషులకు అలభ్యమైన నిరావరణ గల విషయాలు సుభాషిణి
వ్రాస్తుంది తన రచనల్లో.''

''శ్రీరాజ్యం కూడా అలాగే తన మనస్సులో పొంగు
తున్న అగ్నిపర్వతాలలోని లావా ప్రవాహాలను సాహిత్య స్రవం
తిలో ఎగిసి వచ్చేటట్టు చేస్తుందా ?''

''చేయదు, అలాగ ఎన్నడూ చేయదు. సుభాషిణికి
పూర్తిగా వ్యతిరేకం శ్రీరాజ్యం. హిందీ నుండి తెలుగు చేసిన
అనువాదాలు నిజంగా ఉత్తమశ్రేణికి చెందిన సాహిత్య కథలు.
శ్రీరాజ్యం హిందీ నుండి రెండు నవలలు అనువాదం చేసింది.
ఒకటి ప్రేమచంద్ ''గోదాన్'', రెండు జైనేంద్రకుమార్
''త్యాగపత్ర.''

''స్వంతంగా ఏమీ వ్రాయలేదా ?''

''ఇంతవఱకు అచ్చు కాలేదు, కాని యిప్పుడే నావద్ద
వ్రాతప్రతులు వదలివేసి వెళ్లింది. అందులో ఆమె వ్రాసిన
వ్యాసాలు సంపుటీకరించి ఉన్నాయి.''

''దేనిని గూర్చి ?''

''మీరాబాయి, సూరదాస్: సూరదాస్ గూర్చి మూడు
వ్యాసాలు. రెండు ఆతని కవిత్వములోని వాత్సల్య రసమును
నిరూపిస్తూ, ఇంకొకటి ఆతని కృతుల గూర్చి. మఱొకటి
అసామీయ కవి మహాపురుషుడు శంకరదేవ్‌ని గురించి. ఈ
తీర్థయాత్రలో తాను ఒంటరిగా వెళ్లినందుకు కలిగిన మహా
భాగ్యం ఈ భక్త కవిని గూర్చి తెలుసుకోవడమేనని ఆమె
చెప్పిందట.''

ఆమెతోపాటు యాత్రలు సేవించిన ఒక అసామీ
కుటుంబంతో కలిగిన పరిచయంవలన ''శంకర్‌దేవ్' ''బడో
గీతాలు'' వినడం, దానిలోని భక్తిరసామృతాన్ని సేవించడం
ఆమె తనకు లభించిన మహా భాగ్యంగా భావించుకొన్నది.
ఈ వైష్ణవ భక్త కవి రచనలన్నీ వాత్సల్యరస పూరితాలే.
మరో రసం ఆతని కవిత్వంలో లేనేలేదు. ఈ మాటలు
చెప్తూఉంటే ''శ్రీరాజ్యం'' భక్తిరసావేశంతో ఉత్తేజితురాలయి
పోయిందని చంద్రభాను అంటాడు.

''అంతా బాగానే ఉంది కాని ఇంతకాలం గడచిపోయినా,
ఈ అమ్మాయి విరూప భావన భర్త యెడల ఎందుచేత ప్రసన్న
కాలేదో ?'' అని నేను తిరిగి ప్రశ్నించాను. దానికి
చంద్రభాను సమాధానం : ''ప్రసన్న అంటే బహుశః ఒక్క
ఆ అర్థంలో కాలేదేమో, కాని మిగతా అన్ని విషయాలలోను ఆమె
ప్రసన్నురాలే. భర్త ఆమెయెడల ఉదారంగాను, మహనీయం
గాను ప్రవర్తించాడు.

''శ్రీరాజ్యం'' కథ వినగానే ఒక్క సంగతి స్పష్ట
మైంది. ''నారీర్‌మూల్య'' (శరత్‌చంద్రుని వ్యాసం) ''స్త్రీ
విలువ'' గూర్చి ఈ పృథ్వీలో ఏ పురుషుడు కూడ ఆమె భర్త
గ్రహించినట్లు గ్రహించి ఉండడని తోచింది. ఏఒక్క రోజు
కూడ ఆత డామెను అవమానపఱచలేదు. ఏయొక్క క్షణమైనా
ఆమెను ఆఱడి పెట్టలేదు.''

ఇదీ—నాకు తెలిసినంతవఱకు నదికి పోతగట్టు కథ.

* * *

వీరగుడి గుంటూరుజిల్లాలోని ఒక కుగ్రామం. నేను
ఇన్‌స్పెక్షన్‌కు వెళ్లే యిలాకాలోకి యిది రాదు. ప్రక్కనే
నెల్లూరుజిల్లా వరకు నేను తనిఖీకి పోవచ్చును. ఈసారి నెల్లూరి
జిల్లాలోని గూడూరు వరకు ఆఫీసు పని ఉండటంచేత వెళ్లాను.
అక్కడనుండి ఒకరోజు సెలవు తీసుకొని నిడుబ్రోలువద్ద
డాక్ బంగళాలో మకాము వేశాను. వేసి, వీరగుడి గ్రామం
ఉన్న తాలూకా తహశీల్దార్‌కి కబురు పంపించాను. ఒకేసారి
పనులన్నీ ముగించుకొని ఆయన వస్తే తిరిగి వెళ్లిపోవచ్చునని
ఆయనకు నేను పిలుపు పంపించాను. సాయంకాలం చీకటి
పడిన తరువాత వచ్చినా కాని ఫరవాలేదని నా ఆహ్వానం.
ఆ తహశీల్దారు అలాగే తన పనులు ముగించుకొని చీకటి
పడిన కొంతసేపటికి ట్రావెలర్ బంగళాకి వచ్చాడు. ఆతనితో
పాపయ్యలింగం ప్రసక్తి తెచ్చాను. తీగ కదిలిస్తే డొంక
బయట పడినట్టు, ఆ తహశీల్దార్ తనకు తెలిసిన సంగతులన్నీ
చెప్పాడు. ఆతనివల్ల విన్న మాటలే మీకు నేను తిరిగి చెప్తు
న్నాను.

పాపయ్యలింగం స్వగ్రామం వీరగుడి. అయినా ఆ చుటు
ప్రక్కల అయిదారు గ్రామాలలోను పేరుమోసినవాడు. మోతు
బరి అయిన పెద్ద రైతు. సంపన్న వ్యక్తి. వంద ఎకరాలపై
చిల్లర కమతం. మామిడితోటలు, అరటితోటలు వేసి బాగా
సంపాదించాడు. అరటితోటల పెంపకంలో ఆఱితేఱిన మొనగా
డని పాపయ్యలింగానికి మంచి పేరు. ఆదర్శ కృషికుడు. కృషి

పండిట్. మన దేశంలో జరిగిన అనేక వ్యవసాయ ఫల ప్రదర్శనలలో ఆతడు పండించిన అరటి గెలలకు ప్రథమ బహుమతులు వచ్చాయి. రాష్ట్రపతి, ప్రధానమంత్రి మొదలు, పశ్చిమబెంగాలు ముఖ్యమంత్రి బిధాన్‌చంద్ర రాయ్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి వఱకు అనేక ముఖ్య నాయకులతోపాటు పాపయ్యలింగం కప్పులూ, షీల్డులూ అందుకొంటూ తీసుకొన్న ఫోటోలు పత్రికలలో అచ్చు పడ్డాయి. గ్రామ పంచాయితీ అధ్యక్షుడై క్రిందటి సంవత్సరం పంచాయతీ సమితి అధ్యక్షుడుగా కూడ ఎన్నికయ్యాడు. మనిషి చాల మంచివాడు. అజాతశత్రువు. తన స్వంత ధనం పెట్టుబడి పెట్టి ఆ గ్రామంలో బాలికల కోసం ఒక హైస్కూలు స్థాపించాడు. స్త్రీ విద్య అంటే ఆతనికి అపరిమితాభిమానం. భార్యకు తెలుగుతోపాటు హిందీ నేర్పించడానికి బెనారెస్‌లో ఉండి చదువుకొని వచ్చిన హిందీ మున్షీని పెట్టాడు. ఆమె క్షుణ్ణంగా తెలుగు, హిందీ భాషలలో పాండిత్యం సంపాదించడమే కాక హిందీ—తెలుగు అనువాదాలు చేస్తూ వచ్చింది. అప్పుడప్పుడు పత్రికలలో తాను చేసిన అనువాదాలు ప్రకటిస్తూన్నట్టు విన్నాడు. ఆ సంగతి తెలిసి, ఆమె భర్త ఎంతో ఆనందించేవాడు. ఇదంతా బాగానే ఉంది కాని ఈ దంపతులకి పిల్లా జెల్లా ఎవరూ కలుగలేదు. అందుకని ఆమె అత్తగారు, కోడల్ని ఎందఱెందరో వైద్యులకి చూపించింది. ఆయుర్వేద భిషగ్వరులు, యూనానీ హకీంలు, అల్లోపతీ డాకర్ల ఎందఱెందర్నో చూచారు. ఎవరిచేత ఏమీ కాలేదు.

"హాస్పటల్‌కి తీసికొనివెళ్లి పరీక్ష చేయించారా ?" అని నేను ప్రశ్నించాను.

"ఆఁ, గుంటూరు హాస్పటల్‌లో రెండుసారులు పరీక్ష చేయించారు. ఇవన్నీ చేయకుండా ఆ ముసలియామె ఊరికే కోడలిని విడిచిపెట్టివేస్తుందా" అని తహశీల్దార్ సమాధానం చెప్పాడు.

"పాపయ్యలింగం ఏమంటాడు ?"

"ఏమంటాడు ?" అంటూ తహశీల్దార్ పెదవి విరిచి వేశాడు.

"పాపయ్యలింగం విచిత్రమైన వ్యక్తి. మళ్లీ పెళ్లి చేసుకోమని ఆతని బంధువులు, ఆప్తవర్గం ఎన్నోరకాల బలవంతం చేశారట. ఆ యాప్తకోటిలో అతని భార్యకూడ ఉన్నదంటే ఆశ్చర్యంలేదు. ఎవ రెన్ని చెప్పినా ఆతడు మళ్లీ పెళ్లి చేసుకోవడానికి 'ససేమిరా' సమ్మతించలేదు." అంటూ తహశీల్దార్ చెప్తున్నాడు.

"తన భార్య మనస్సు నొప్పించకూడదనేమో ? అంతకంటే ఏముంటుంది ?"

"ఇందులో స్త్రీదోష మేముంది ? ఆమెయే చేసుకోమన్నది కదా ! ఇంతకీ విధి విలాసం ! ఇంత అనుకూల దాంపత్యంలో, ఇంత అందమైన యువతి భార్యగా గల కాపురంలో, ఆ సుందర స్త్రీని వంధ్యగా చేయడం, ఈశ్వర చిద్విలాసం కాక మఱేమిటి ?"

"అయితే ఈ దంపతులు ఏ పిల్లవాడినైనా దత్తత చేసుకోలేక పోయారా ?"

"లేదు. దానికి పాపయ్యలింగం సమాధానం—సంతానం కావాలనే కోరిక స్త్రీలనే ఎక్కువ బాధిస్తుంది కదా ? ఈ విషయంలో ఆమెకు పట్టింపు లేనపుడు నే నెందుకు కలుగ జేసుకోవాలి అనేవాడట !"

"ఆమెకు కోరిక లేదా ?"

"లేదు. అయితే ఆమె ఏది అడిగితే అది జరిపించే ఉదారత పాపయ్యలింగంలో ఉన్నది. ఉదాహరణకు అతని భార్య కావాలన్నది కాబట్టి తండ్రితో దెబ్బలాడి అయినా సరే, బాలగోపాల దేవాలయం కట్టించి అక్కడ కృష్ణ విగ్రహాన్ని ప్రతిష్ఠ చేయించాడు. వాళ్ల కుటుంబానికి పరంపరాగతంగా శివారాధనే ముఖ్యం. పైగా ఈ ప్రాంతాలలో రాధాకృష్ణ విగ్రహాల ప్రతిష్ఠ కాని, బాలగోపాల దేవాలయ నిర్మాణం కాని అంత ఎక్కువగా జరుగవు."

"ఇంతకీ పాపయ్యలింగం—ఈ రూపవతి అయిన భార్య అంటే అనురక్తుడేనా ?"

"అవును, యథాస్త్రీ తథా పతిః అన్న సామెతలాగ, వ్యక్తిగతంగా పాపయ్యలింగం స్వభావంచేత చాల మంచివాడు. ఆతనిలో వంక పట్టడానికి ఏమీ లేదు. ఒక్కటి మాత్రం—నా దృష్టిలోకి వచ్చింది. అది కూడ చాల యేండ్ల క్రితం జరిగింది. ఎంతవఱకు నిజమో చెప్పలేను."

నేను జిజ్ఞాసగా, మౌనంగానే, అది తెలుసుకోవాలని కుతూహలం చూపించాను.

"ధనవంతులైన పురుషులు కొంచెం చలించి ఎంగిలి పడడంలో ఆశ్చర్యంలేదు. ఈ ప్రాంతాలలో అలాంటి చంచల స్వభావం పెద్ద లెక్కలోకి తీసుకోరులెండి", అంటూ ఆ తహశీల్దార్ వికవిక లాడుతూ నవ్వడం మొదలుపెట్టాడు.

"అలాగా ?" అంటూ నేను కొంత ఆశ్చర్యం ప్రకటించాను. తహశీల్దార్ తన కథ కొనసాగించాడు.

"పదేండ్ల క్రితం మాట. పాపయ్యలింగం పెండ్లి అయిన క్రొత్తలో ఒకటి రెండేళ్లయినా దాటకుండానే ఇది జరిగింది. ఒకరాత్రి వేకువజామున వీరగుడి ప్రక్క ఒక చిన్న గ్రామం 'శంఖ సముద్రం' నుంచి ఒక ముసలి రైతు రొప్పు

కొంటూ వచ్చి మా తలుపు కొట్టాడు. తలుపు తెఱవగానే నేలమీద పడి ఏడవడం మొదలుపెట్టాడు. కారణం ఒక ఘోరం జరిగిపోయింది. అతని కుమార్తె, బాలవితంతువు ఉరి పోసికొని చచ్చిపోయింది. ఆమాట చెప్పడానికే ఆతడు ఆవేశపడి పోతున్నాడు.

"బాబూ! ఇది ఆత్మహత్య కాదు. హత్య—ఖూనీ" అంటూ కేకలువేస్తూ రోజుకొంటూ చెప్పాడు. కడచిన రెండు సంవత్సరాలనుండి పాపయ్యలింగం ఈ ముసలిరైతు ఇంటికి వస్తూ పోతూ ఉండేవాడట. అతని కుమార్తెతో సంబంధం. ఆ సంగతి వినగానే నేను విస్తుపోయాను. అంటూ తహశీల్దార్ చెప్పబోయాడు.

"మీ కెందుకు ఆశ్చర్యం కలిగింది?" అని నేను ప్రశ్నించాను.

"ఏమీలేదు. పాపయ్యలింగం అలాంటివాడు కాడు. అంత వఱకు త్రోవతప్పి ఎఱుగడు. పైగా అతనికి పెళ్లి అయింది. త్రిలోకసుందరియైన భార్య క్రొత్తగా కాపురానికి వచ్చింది. వయస్సులో ఏ కొంచెమో తేడా తప్ప, ఆమె చాలా అనుకూల వతి, రూపసి అయిన ధర్మపత్ని. అలాంటివాడు—తప్పుటడుగు వేశాడంటే నమ్మలేకపోయాను."

ఆ వృద్ధుడు బిగ్గరగా రోదన పెడ్తూఉంటే అతని ఆవేదన ఆపలేకపోయాను.

"ఎంత పేదవాడయినా తండ్రి తండ్రే కదా! ఎంత పేదరాలయినా స్త్రీ స్త్రీయే కదా! ఆమె శక్తి స్వరూపిణి, దుర్గామాత, దేవతాంశ సంభూతురాలు. ఆమె మూల్యం ఐశ్వర్యవంతుల సిరిసంపదలన్నీ యిచ్చినా కాని కొనలేనిది. అలాంటిదాన్ని—అయ్యో—ఈ ఆకతాయి" అంటూ గుండెల మీద బాదుకొంటూ ఆ ముసలితండ్రి ఏడ్చివేశాడట. అక్కడికీ ఆ పేదరైతు పాపయ్యలింగాన్ని ఎన్నోసారులు వేడుకొన్నాడట.

"అయ్యా! ఈవిధంగా మా అమ్మాయిని అవమాన పఱచవద్దు. నీకు ఆపిల్ల అంటే యిష్టముంటే పెళ్లి చేసుకో. లేకపోతే యింక యీ గుమ్మం తొక్కవద్దు" అని ఖండితంగా చెప్పివేశాడు. ఆమాట అతని చెవి కెక్కలేదు. మఱి నాలుగు నెలలు గడిచాయి. ఆ అమాయకురాలు గర్భవతి అయింది. అప్పుడుకూడ ఆమెను వివాహం చేసుకోవడానికి ఆ పెద్దమనిషి యిష్టపడలేదు.

ఈవేళ అర్ధరాత్రివేళ ఆ యమ్మాయి మెడకి ఉరిపోసుకొని— యీ పృథ్విలో ఆడు పుట్టుక పుట్టినందుకు స్త్రీ విలువను నారీమూల్యాన్ని చెల్లించుకొని వెళ్లిపోయింది. ఇపుడేం చేయమంటారు బాబూ, అంటూ ఆ ముసలివాడు గద్దించాడట. దానికి తహశీల్దారు నయాన భయాన ఆ ముసలి రైతుని బెదిరించి ఆ రైతుకి అనేకవిధాల నచ్చచెప్పాడు.

"చూడు, ముసలయ్యా! తగిన సాక్ష్యం రుజువు లేకుండా పాపయ్యలింగం వంటి మోతుబరి రైతుమీద లేనిపోని అపనిందలు వేస్తే కోర్టు వ్యవహారం చాలా పైకి పోతుంది. సర్కారు చట్టం అతని పక్షాన ఉన్నది. సాక్ష్యం చట్టుబండలు లేకుండా నీ వెన్ని చెప్పినా నీ మాటలు నమ్మరు. పైగా లేనిపోని కట్టుకథలు కల్పించి ఒక పెద్దమనిషి మంచి పేరు వీథిలో పెట్టావని నిన్ను శిక్షిస్తారు" అంటూ హడలుగొట్టి పంపించివేసిన సంగతి తహశీల్దారు చెప్పాడు. అంతే. అంతకుమించి నేను విశేషంగా తెలిసికోవలసిన అవసరం లేకపోయింది.

ఇదీ, నా మనస్సుకి తోచినంతవఱకు నదికి కోతగట్టు కథ.